క్లుప్తంగా

ఆర్థిక సహాయం


సత్యం కూతుళ్లకు సహాయం అందజేస్తున్న గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): అకాల మరణం పొందిన వైద్యుని కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. ఘణపూర్ గ్రామానికి చెందిన స్వర్గం సత్యం ఆర్ఎంపీగా వైద్య సేవలు అందిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరి కుటుంబ పరిస్థితి చూసిన గ్రామస్తులు చందాలు పోగు చేసి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. సత్యం కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భిక్షపతి

హుస్నాబాద్‌రూరల్: విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా సాంకేతిక విద్యలో నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షపతి అన్నారు. కళాశాలలో ఉద్యమిత్వ నైపుణ్యా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన వర్క్ షాపు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ రంగంలో రాణించాలంటే సాంకేతిక విద్యపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజిరెడ్డి, ఇందిర పాల్గొన్నారు.

గణిత నమూనాల ప్రదర్శన


నమూనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం పోస్టర్ నమూనా ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకుని అభినందించారు. పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నమూనాలను సందర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.పవన్‌కుమార్, అధ్యాపకులు రాధిక, డాక్టర్ లక్ష్మినర్సింహారెడ్డి, డా. సంగీత, డా. దీపిక, రమ్య పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం


సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పెంచడంపై భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిల ఫ్లెక్సీకి కార్మికులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, మండల అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, చందు, కోశాధికారి నర్సింలు, నాయకులు రవి, జాని, మస్తాన్, యాదగిరి, కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్క నాటుతున్న ఎస్‌ఐ సౌజన్య

బెజ్జంకి(సిద్దిపేట): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బెజ్జంకి ఎస్‌ఐ సౌజన్య అన్నారు. యువజన సంఘాల నాయకులు మధు ఆధ్వర్యంలో గురువారం బెజ్జంకి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం, ఎడ్ల బొమ్మల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మాజీ సర్పంచ్ నర్సయ్య, మధుసూదనాచారి, పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఐలయ్య, సునీత, నర్సింగం పాల్గొన్నారు.

హుస్నాబాద్ అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి పొన్నం ప్రభాకర్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


హుస్నాబాద్: హుస్నాబాద్‌లో ఆల్బియన్ బస్సు నమూనాను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్


హుస్నాబాద్: ఆల్బియన్ బస్సు నమూనా

హుస్నాబాద్: నాలుగు జిల్లాలకు సెంటర్‌గా ఉన్న హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం రాత్రి బస్టాండ్ ఆవరణలోని ఆర్టీసీ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆల్బియన్ బస్సు నమూనాను ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అంతకుముందు మండలంలో బంజర్‌పల్లి నుంచి వయా పందిల్ల మీదుగా గొల్లపల్లి వరకు రూ.2.47 కోట్లతో చేపట్టిన పీఆర్ రోడ్డుకు, పొట్లపల్లి నుంచి పరివేదకు రూ.2.07 కోట్లతో చేపట్టిన పీఆర్ రోడ్డుకు, పట్టణంలో రూ.2 కోట్ల వ్యయంతో ఆరపల్లెలోని పల్లె చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 3 కోట్లతో చేపట్టిన శ్రీ చైతన్య స్కూల్ నుంచి పెట్రోల్ బంక్ వరకు సెంట్రల్ మీడియం అవెన్యూ ప్లాంటేషన్ అభివృద్ధి, సుందరీకరణ, స్వాగత తోరణాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఉత్తర తెలంగాణ ప్రాంతానికి అవగాహన కలిగే విధంగా 1930లో నిజాం కాలం నాటి ఆల్బియం బస్సును ప్రారంభించినట్లు తెలిపారు. టూరిజం, విద్య, ఇండస్ట్రీయల్, అగ్రికల్చర్, ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ రీజినల్ మేనేజర్ రాజు, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భూపతి రెడ్డి, మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఉన్నారు.

కోహెడలో..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలో రూ. 57లక్షలతో నిర్మించిన కాచాపూర్ బ్రిడ్జి, నారాయణపూర్‌లో రూ.91. 55 లక్షలతో నిర్మించే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ సదానందం, ఏఎంసీ చైర్మన్ నిర్మల జయరాజ్, నాయకులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మల్లారెడ్డి

సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కూటిగల్‌లో తూటాల మర్రికి, స్తూపం వద్ద అమరవీరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 మంది యువకులను ఊరు బయటకు తీసుకువచ్చి గ్రామ శివారులో ఉన్న మర్రి చెట్టుకు కట్టేసి కాల్చి చంపారన్నారు. దీంతో గ్రామం శవాల దిబ్బగా మారిందన్నారు. ఆ తరువాత గ్రామ గ్రామాన ఎర్రజెండా ఆధ్వర్యంలో సాయుధ పోరాటం ఉవ్వెత్తున ఎగిసిపడిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు యాదగిరి నాయకులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

రాయపోల్ ఎంపీడీవో జేమ్స్



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

దుబ్బాకటౌన్: విద్యార్థుల భవిష్యత్తు రూపకల్పనలో, దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని రాయపోల్ ఎంపీడీవో జేమ్స్, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి బాలలే రేపటి పౌరులని, దేశ అభివృద్ధిలో విద్యార్థుల భవిష్యత్తు రూపకల్పనలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తీర్చిదిద్దే నైపుణ్యం ఉపాధ్యాయునికే ఉందన్నారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై న ఉపాధ్యాయులకు, సీఆర్పీలను సన్మానించి, సర్టిఫికెట్, అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం చెట్ల నరికివేత


ముద్దాపూర్ నుంచి కొడకండ్ల వెళ్లే రోడ్డు ప్రక్కన చెట్లను తొలగించిన దృశ్యం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్ గ్రామ శివారులో రోడ్డు ప్రక్కన ఉన్న చెట్లను నరికారని గ్రామస్తులు తెలిపారు. సుమారు 8 నుంచి 10 ఏళ్ల కింద రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలను పరిరక్షించే బాధ్యతలను ఈజీఎస్, అటవీ శాఖ అధికారులు చూస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుకు ఆనుకొని వ్యవసాయ భూమి ఉన్న ఓ సీడ్ కంపెనీ యజమాని ఇష్టానుసారంగా సుమారు 200 మీటర్ల దూరం వరకు హరితహారం చెట్లను నరికివేశాడని గ్రామస్తులు పేర్కొన్నారు. చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చేర్యాలలో భారీ వర్షం

జలమయమైన గాంధీ ఏరియా


చేర్యాల(సిద్దిపేట): వర్షం నీటిలో కారును నెట్టుతున్న దృశ్యం


హుస్నాబాద్: హుస్నాబాద్‌లో జలమయమైన రోడ్డు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు 3 గంటలకు పైగా కురిసిన వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారి అంతా జలమయమైంది. గాంధీ ఏరియా కడవేర్గుకు వెళ్లే దారి పూర్తిగా నీటితో నిండిపోయి ఇండ్ల మధ్యలోకి నీరు వచ్చి చేరింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

హుస్నాబాద్‌లో...

హుస్నాబాద్: పట్టణంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. మెయిన్ రోడ్డు, అంబేడ్కర్, మల్లె చెట్టు చౌరస్తాల ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మురికి కాలువలు ఉప్పొంగి రహదారులను ముంచెత్తాయి. వరద నీరు దుకాణాలకు వెళ్లడంతో జనం ఆందోళనకు గురయ్యారు. ఉరుములు, మెరుపులతో దాదాపు 2 గంటల పాటు భారీ వర్షం కురవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు సీజనల్ వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, టైఫాయిడ్, డెంగ్యూ, విషజ్వరాలపై తీసుకునే జాగ్రత్తల గూర్చి తమ ఆట పాటలతో ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, సాంస్కృతిక సారథి పిన్నింటి రత్నం, హరిప్రసాద్, శ్రీనివాస్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నేడు అక్కన్నపేటకు మంత్రి పొన్నం రాక

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేయడానికి శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, యూత్ మండలాధ్యక్షుడు దామోదర్ తెలిపారు. ఉదయం 10గంటలకు సంజీవయ్యకాలనీ నుండి కొత్తగా నిర్మించబోయే ఆర్అండ్‌బీ రోడ్డుకు శంకుస్థాపన, అనంతరం బొడిగేపల్లి గ్రామంలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే చౌటపల్లిలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, మల్లంపల్లి టూ తాళ్లతండా వరకు బీటీ రోడ్డు, మంచినీళ్లబండ గ్రామంలో జీపీ భవనం ప్రారంభిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 12:30గంటలకు యాటకార్లపల్లె నుంచి మంచినీళ్లబండ వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

సెమినార్‌లో ఉపాధ్యాయులు పాల్గొనాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (టీజీఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో అక్టోబర్ 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సెమినార్‌లో ఉపాధ్యాయులు పాల్గొనాలని, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 'విద్యార్థుల విద్యా తీరు, వృత్తిపరమైన ఎంపికలపై సలహా' అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఈ సెమినార్‌కు సంబంధించిన పత్రాలను ఈ నెల 12లోగా ఎస్‌సీఈఆర్‌టీ మెయిల్‌కు పంపించాలని సూచించారు. ఎంపికైన ఉపాధ్యాయులు సెమినార్‌లో మాట్లాడాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్, ధర్మారెడ్డిపల్లి, వర్గల్ మండల పరిధిలోని మజీద్‌పల్లి, నెంటూరు, రాయపోల్ మండల పరిధిలోని బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు సరఫరా ఉండదు. ఆయా గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు, రైతులు, సహకరించాలని కోరారు.

నేడు శాంతి ర్యాలీ

సిద్దిపేటకమాన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట తహరీకే తహఫూజ్ సున్నియత్ జమాత్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ముఫ్తి కరీముద్దీన్ తెలిపారు. పట్టణ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో నిర్వహించనున్న ర్యాలీలో పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో అసిఫ్, అబ్దుల్, అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


గాడిచర్లపల్లిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సిద్దిపేటజోన్ : వర్షాల నేపథ్యంలో ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని 7, 15వ వార్డుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఏడో వార్డులో యూజీడీ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. మురికి కాల్వలో చెత్త, మట్టిని తొలగించాలని సూచించారు. మురికి కాల్వల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, వైస్ చైర్మన్ కనకరాజు, ప్రజాప్రతినిధులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహిజ్, అధికారులు దేవరాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు

సిద్దిపేటలో మెగా జాబ్ మేళా


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు మాజీ మంత్రి హరీశ్ రావు ప్రత్యేకంగా మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు వేణుగోపాల్ రెడ్డి, సాయిరాం తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 13న స్థానిక విపంచి ఆడిటోరియంలో జాబ్ మేళా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఆంజనేయులు, ప్రభాకర్ రెడ్డి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకిచ్చిన హామీలు ఏమాయే?


కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా నిరుద్యోగులు

కలెక్టరేట్ ఏఓకు నిరుద్యోగ జేఏసీ వినతి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గురువారం జిల్లా నిరుద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అలాగే గ్రూప్ 1 పరీక్షను మళ్లీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అందని ద్రాక్షగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు, నాయకులు సాయిరాం, శ్రీకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు స్ప్రేయర్లు అందజేత


రైతులకు స్ప్రేయర్‌లను అందజేస్తున్న వీసీ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): సబ్సిడీపై అందజేసే స్ప్రేయర్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ములుగు ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్. రాజిరెడ్డి సూచించారు. గురువారం ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 50 మంది రైతులకు స్ప్రేయర్‌లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు చీనానాయక్, లక్ష్మినారాయణ, జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ, హెచ్ఓ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ


నంగునూరు(సిద్దిపేట) : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సరిత

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): ఈ నెల 19 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో జరిగే ఫొటో ఎగ్జిబిషన్ వాల్ పోస్టర్‌ను చిన్నకోడూరులో ఎస్‌ఐ సైఫ్ అలీ, నంగునూరులో తహసీల్దార్ సరిత ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫొటో ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి ఫొటో గ్రాఫర్ పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర్, భాస్కర్, శివ, నర్సయ్య, ఆర్‌ఐ లింగం, జయసూర్య, నాయకులు పర్శరాములు, బాలకిషన్, అఖిల్ రాకేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పెద్ద చెరువు పరిశీలన

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట - భూంపల్లి మండలం పోతారెడ్డిపేట గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దచెరువు చెక్ డ్యాం తెగిపోయింది. చెక్ డ్యాం తెగిపోవడంతో చెరువుకు భారీ గండి పడింది. దాని కింద ఉన్న పంట పొలాలు దెబ్బ తిన్నాయి. గురువారం ఇరిగేషన్ అధికారులు చెక్ డ్యాంను పరిశీలించారు. ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ రోహిత్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కమలాకర్, మహిపాల్ పాల్గొన్నారు.

◆ టోకెన్ల కోసం ఇబ్బంది పెట్టొద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్): యూరియా కోసం వచ్చే రైతులను టోకెన్ల పేరిట గంటల తరబడి రైతు వేదికల వద్ద నిలబెట్టవద్దని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొల్లపెల్లి వీరాచారి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానాను కలిసి విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం ఆరు రైతు వేదికలు ఉండగా.. కేవలం మండల కేంద్రంలో ఉన్న వేదిక వద్దకు రైతులను పిలిచి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. క్లస్టర్ల వారీగా ఉన్న అన్ని రైతు వేదికల్లో టోకెన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దినేశ్‌రెడ్డి, నాయకులు రైనా నాయక్, అజ్మీర అనిల్ నాయక్ తదితరులు ఉన్నారు.

◆ 15న గజ్వేల్‌లో కబడ్డీ ఎంపికలు

గజ్వేల్: జిల్లా స్థాయి బాలికలు, బాలుర కబడ్డీ జట్ల ఎంపికను ఈనెల 15న గజ్వేల్‌లో నిర్వహించనున్నట్లు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, శివకుమార్ తెలిపారు. ఆరోజు ఉదయం 10గంటలకు పట్టణంలోని ఐఓసీ వెనుకభాగంలోని మైదానంలో ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 ఏళ్ల లోపు, 55 కేజీల బరువులోపు ఉన్న బాలబాలికలు ఈ ఎంపికకు హాజరు కావాలన్నారు. రిజిస్ట్రేషన్ రూ. 100 చెల్లించి, ఆధార్‌కార్డు, బోనోఫైడ్ తీసుకొని హాజరు కావాలని సూచించారు. ఎంపికై న వారు నిజామాబాద్ ముప్కాల్‌లో ఈనెల 25 నుంచి 28వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

◆ నేడు రక్తదాన శిబిరం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో నేడు నిర్వహించనున్న రక్తదాన శిబిరంను విజయవంతం చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ హైమావతి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు గివ్ బ్లడ్ సేవ్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. యువతీ, యువకులు, సామాజిక సేవా కార్యకర్తలు, యువజన సంఘాల నాయకులు, అధికారులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

తొగుట(దుబ్బాక): విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సీఐ ఎస్‌కే లతీఫ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళా చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. విద్యావంతులను సమాజం ఎప్పుడు గౌరవిస్తుందన్నారు. అపరిచితులతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, మహిళా రక్షణ చట్టాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవికాంత్ రావు, హెచ్ఎం ఉపేందర్,సిబ్బంది పాల్గొన్నారు.

◆ విద్యార్థికి అభినందన

సిద్దిపేటరూరల్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అగ్రిటెక్ -2025 పరీక్ష ఫలితాల్లో తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ప్రజ్ఞశ్రీ రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించిందని ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. ప్రజ్ఞశ్రీ రెండేళ్లు తోర్నాల పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదివిందన్నారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఇందూజ, స్పందన, అభిలాష్‌రెడ్డి, పూర్వ ప్రిన్సిపాల్ శ్రీదేవి అభినందించారు.

◆ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



మిరుదొడ్డి(దుబ్బాక): సిద్దిపేట సీపీ అనురాధ ఆదేశాల మేరకు మిరుదొడ్డిలో గురువారం ఎస్‌ఐ సమత నేతృత్వంలో పోలీసు సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కల్లు డిపోలు, కల్లు దుకాణాలు, కిరాణా షాపులు, హోటళ్లు, పాన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.